# మృత రచయితల ఎన్నిక ముచ్చట్లు

రచన :
శ్రీ బి. మోహనరావు

చచ్చిపోయిన రచయితల జీవాలన్నీ అక్కడ సభ జరుపుతున్నాయి.

విషయం—అధ్యక్షుని యెన్నిక.

ఒక ముసలిజీవి లేచి—

....అబ్బాయిలూ! నా పేరుభీమరథశాస్త్రుల్లు. నేను అనేక శతావధానులు చేశాను. నిజంగా కవిత్వంలో నేమ పోని ధోరణే లేదంటే నమ్మండి. ఈ నాడు తెలుగులో యెవరన్నా కవిత్వం రాస్తున్నారంటే నా దగ్గిర చదువుకోవటంవల్లే కదూ? నన్ను చాలామంది జమీందారులు మహారాజులు పిలిచి సన్మానించి గండపెండేరాలు ఇచ్చారు. నా సంగతి నేను చెప్పుకోవాలా? మీ కందరికీ తెలియదూ? అందుచేత నన్ను అధ్యక్షుడుగా యెన్నుకోండి. (సభలో యెక్కువ కదలికలేదు. ఎవరూ అంత పట్టించుకున్నట్లు కనబడదు).

ఇంకో జీవి లేచి :

నేను కవిని. (అని ఒకపద్యం చదివేసి) కవిత్వమంటే ఇది. ఇది రాసినవారు ఇక్కడ మీ యెదట విల్చొన్నవారే. (మొదటిజీవి నుద్దేశించి) తాతగారూ; మీ కెందుకండీ ఈ శ్రమ. పెద్దవారు మీరు ఈ బాధ్యతలన్నీ నిర్వహించటానికి కష్టపడటం మేం సహించలేదు. అందుచేత నన్ను అధ్యక్షుణ్ణిగా యెన్నుకుంటే చాలా బాగుంటుందని మనవిచేస్తున్నాను సభవారికి.

వేరొకజీవి లేచి :

నా అసలుపేరు చెపితే మీ కెవరికీ తెలియదు. నేను మధుపాయి అనే పేరుతో గేయాలు వ్రాసేవాణ్ణి. గేయాలు నా అంత బాగా రాసేవాడు లేనే లేడు. చూశారూ! చల్లని సాయంకాలం వేళ సూర్యుడు వెళ్ళిపోయి చంద్రుణ్ణి చిరుచీకట్లనీ పంపించేటప్పుడు, ఆ సుందరి కొలనునుండి నీళ్ళు తెస్తున్నప్పుడు, ఆమె ప్రియుడు చెట్లుచాటునుండి చూస్తున్నట్లు గేయం వ్రాసింది నేనే. నిజంగా ప్రజలు నా కవిత్వాన్నే అర్థంచేసుకుని చదివితే....

ఒక జీవి హఠాత్తుగా లేచి ఆయన్ని మధ్య ఆపేసి—

నా పేరు జగం జయరావు. నిజం చెప్పొస్తే నేను సార్థకనామధేయుణ్ణి. నేను జర్నలిస్టును లెండి. వీళ్ళందరూ ఉన్నట్లు ఆసలు ప్రపంచకానికి చెప్పేది నేను కాదూ? నేను ఆ సన్మాన సభనిగురించి మా పత్రికలో వెయ్యకపోతే ఆ విషయం అసలెవరికి తెలుస్తుందీ? ఈ భావకవి పద్యాలే వెయ్యకపోతే ఈయనెక్కడుండేవాడు? నేను చేసిన సాహిత్యసేవకి నన్ను తప్పక....

మరొక జీవి రపీమని లేచి—

ఛీ ఛీ! ఇది ప్రజలకెందుకు పనికొస్తుంది. ఈ జర్నలిజంలో యేముందీ? రాయిటర్ వార్తలు తెనిగించడం, రిపోర్టర్లు పంపించిన అబద్ధాల రిపోర్టులు వెయ్యటమేగా. నేను అనేక హాస్య రచనలు వ్రాశాను. తెలుగులో మరెవ్వరు హాస్యం అనేపేరుతో రచనలు వ్రాసినా "అదిగో ఆయన ఇదివరకు వ్రాసిందే"ననేటట్లుగా....

ఇంకో జీవి ఈయన్ని చేత్తో కూర్చోమన్నట్టుగా సైగచేసి:

ఈ రచనలన్నీ వ్రాసేది యెవర్ని ఉద్ధరించటానికి చెప్పండి? ఇవి చదివి బాగుపడ్డవాళ్ళెంతమంది? నిజంగా సాహిత్యమంటే ఉన్నది ఉన్నట్టుగా పేదల కష్టాన్నీ, ధనికుల దుర్మార్గాన్నీ చూపించటమే; అది అభివాస్తవికకవిత్వం ద్వారానే సాధ్యమవుతుంది. అందులో అందె వేసిన చెయ్యి నాది. కాబట్టి నన్ను అధ్యక్షుణ్ణిగా యెన్నుకోండి.

చివరికి అధ్యక్షుని యెన్నిక వోటింగుకి పెట్టారు. ఎవరి పేరొచ్చినాగాని ఎవ్వరూ చేతులెత్తలేదు. కాబట్టి ఈ సంఘం నిరాధ్యక్షంగా ఉండేటట్లు తీర్మానించడమైందనుకున్నారు.

---

* ఆనందవాణి